# ‘వాన కురిసి వెలిసింది’

వారణాసి

వాన కురిసి వెలిసింది. పిల్లలు మధ్యగదిలో నిద్రపోతున్నారు. రాత్రి పదకొండు గంటలు. కమలమాత్రం వీధిగదిలో అలాగే కూర్చుని ఉన్నది. తనకు ఎదురుగా ఉన్న గోడగడియారం పదకొండుకొట్టి అయిదునిమిషాలయింది. కమల గడియారంవైపు అలాగే చూస్తూ ఆలోచిస్తోంది. లోలకం తిరుగుతోంది. విరామంలేకుండా తిరుగుతోంది. ఆమె హృదయంలో ఒక భావం లోలకంవలె తిరుగుతోంది. లోలకం ప్రభావం గడియారం అంకెల చక్రంమీద ఉన్నది;ఆమె హృదయంలోని భావం ప్రభావం ఆమెముఖాన ఉన్నది.

‘ఆయన ఇంకా రాలేదు. నా అదృష్టం ఇలా ఉంటే, ఎందుకు వస్తారు? క్లబ్బు రానీయదు. చీట్లపేక ఇంటినే మరిపిస్తుంది.’ కమల ఊహాలు పరంపరగా సాగిపోతున్నాయి. పెద్దపిల్ల సుందరం లేచింది. మధ్యగదిలో తల్లి లేదు. సుందరం ఎనిమిదేళ్ళ పిల్ల. తన మంచానికి ఎదురుగా ఉన్న గుమ్మడికర్ర- మడతమంచం వైపు చూచింది. రెండేళ్ల బుల్లితమ్ముడు నిద్రపోతున్నాడు. లేచి మెల్లిగా వీధిగదిలోకి వచ్చింది. కమల దీక్షగా గడియారంవైపు చూస్తో ఆలోచిస్తూనే ఉంది. సుందరం తల్లికుర్చీ వెనక నిలబడి ‘అమ్మా!’ అని పిలిచింది. కమల ఉలికిపడి ‘ఏం అమ్మా, తమ్ముడు లేచాడా?’ అన్నది. ‘లేదు’ అని సుందరం ఒకక్షణం ఊరుకుంది. ‘ఏమిటే, అమ్మా, ఆలోచిస్తున్నావు? నాన్న రాలేదనా?’ కమల కంగారు పడింది. పిల్లకి వెంటనే సమాధానం యీయలేకపోయింది. సుందరం గ్రహించింది. గడియారం లోలకంవైపు తనూ చూచింది. ‘నువ్వు అన్నం తినలేదా?’ అన్నది సుందరం. ‘లేదు- నాన్నరావాలి.’ సుందరం ఏమీ అనలేదు. పదకొండున్నర అయింది. గడియారం అరగంట కొట్టింది. ‘తమ్ముడిజ్వరం తగ్గలేదమ్మా!’ కమల బరువుగా అంది: ‘లేదు. ఒళ్లుపేలవేస్తోంది జ్వరం. మీ నాన్న వచ్చి డాక్టర్ని తీసుకురావాలి.’ సుందరం మొగంమీద దైన్యం ఆవరించింది. కమల కుర్చీలోంచి వెనక్కి చూచి ‘నువ్వు నిద్రపో అమ్మా’ అన్నది. సుందరం మధ్యగదిలోకి వెళ్ళింది. తన మంచం మీద బాసెనపట్టు వేసుకొని కూర్చున్నది. దీర్ఘంగా చిట్టిబాబు వైపే చూస్తోంది.

కమల ఆలోచనలు శ్రావణమాసంలో నిండు గౌతమిలాగు ఎడతెగక సాగుతున్నాయి. రామారావు ఎప్పుడూ క్లబ్బులో ఉంటాడు. పేకాట ఆడతాడు. అతను కానీ ఆటతో ప్రారంభించాడు. అది అణా ఆట అయింది. అది బేడ అయింది. ఇప్పుడు రూపాయలమీద రన్మూర్ సాగుతోంది. ఇంటికి వచ్చేసరికి రాత్రి ఒంటిగంట దాటుతుంది. ఆడేవాళ్లు అంతా విద్యాధికులు; పెద్ద ఉద్యోగులు; వస్తువిచక్షణ కలవాళ్లు. కచేరీలలో పనిచేసి అలసినవాళ్లు, పెద్ద ఉద్యోగులు- అంతా అక్కడ వాళ్ల ఉద్యోగ భారాన్ని మరచి పోతారు. మరచిపోయి దించుతారు! క్లబ్బు అంటే గౌరవనీయులు జూదం ఆడే ప్రదేశం. నిరక్షరాస్యులైన కూలీలు, సోమరులు అయితే ఊరు బయట ఏ మామిడితోటలోనో ఆడతారు. పోలీసువారు వారికోసం అన్వేషిస్తారు. పట్టుకుంటారు. కేసులు పెడతారు. గౌరవనీయుల జూదాల దరికి పోలీసువారు పోరు. రాత్రి పదిగంటలు దాటి పేకాట ఆడితే క్లబ్బు బైలా ఒప్పుకోదు. సెక్రటరీ ఒప్పుకుంటాడు. క్లబ్బుకి డబ్బు వస్తుంది. ఊళ్లో సబ్ ఇన్స్పెక్టరు పదిగంటలు దాటి ఆడవద్దని లాంఛనంగా చెపుతాడు. వారు విన్నట్లు నటిస్తారు. క్లబ్బు తలుపులు వేసుకొని ఆడతారు.

రామారావు వకీలు. ప్రాక్టీసు తక్కువ. ఇరవై ఎకరాల మాగాణి ఉండేది. ఇప్పుడు రెండు ఎకరాలు ఉన్నది. స్థిరాస్థి రూపాయలుగా మారుతోంది. రూపాయలు కరిగి క్లబ్బులో బల్ల మీద అంతర్వాహినిగా ప్రవహిస్తున్నాయి. చిట్టిబాబుకి రెండేళ్లు వచ్చాయి. పిల్లవాడు పుట్టని

క్రితం కమల తరుచు పేకాట వద్దని భర్తను బతిమాలు కొనేది. ఈ రెండేళ్లనుంచీ అదికూడా మానుకుంది. ఆమెకు అభిమానం ఎక్కువ. భర్తను గూర్చి ఎవరైనా న్యూనతగా మాట్లాడితే భరించలేదు. కన్నపిల్లకి సయితం 'మీ నాన్న పేకాట ఆడుతున్నారు' అని చెప్పదు. చిట్టిబాబుకి జబ్బుగా ఉంది. మనసు వ్యథ పడుతోంది. ఆమె ప్రణయాకాశంలో మబ్బులు పడుతున్నాయి. వాటిని గమనించి ప్రభంజనం వలె తాను చెదర కొట్టుకుంటోంది.

తను కాపరానికి వచ్చిన మొదటి రోజుల్లో ఒకటి రెండుసార్లు, మీరు క్లబ్బుకి వెళ్ళరు కాబోలు, అంది. అప్పుడు ఆయన అన్నారు- 'ఇంట సుఖం లేనివాళ్లు క్లబ్బుల్లోకి వెడతారు, నాకు అనవసరం.' ఆ మాటలు జరిగిన రోజులలో కరిగిపోయాయి. కావాలంటే టెన్నిసు ఆడవచ్చు. చస్ ఆడవచ్చు. బిలియర్డ్సు ఆడవచ్చు. పేకాట! డబ్బు పెట్టి పేకాట! ఆమె హృదయం జలదరించింది. ఇంక ఆలోచించటానికే భయపడింది. ఇంతలో తమ్ముడు లేచాడని సుందరం పిలిచింది. వెంటనే చిట్టిబాబు మంచం దగ్గరకు వెళ్ళింది. నుదుట చేయివేసి చూసింది. పొట్టమీద చేయివేసి చూసింది. ఒళ్లు కాలుతోంది. డాక్టరు కోసం వెళ్లాలి. అర్ధరాత్రి. అవతలి వీధికి ఒక్కతే వెళ్ళాలి. తనకు భయం.

కమల సాహసించింది. బేటరీ లైటు చేత పుచ్చుకొని బయలుదేరింది. పిల్లవాడిని చూడమని సుందరానికి చెప్పింది. అంతా చీకటి. డాక్టరు శేషారావుగారి ఇల్లు ఆవలి వీధిలో ఉంది. తనకు బయలుదేరటం తెలుసు. మళ్ళా శేషారావుగారి గేటు దగ్గర తనలో తాను ఉంది. త్వరగా వెళ్లింది. ఆయనభార్య తనకు స్నేహితురాలు. ఆమెను పేరుపెట్టి పిలిచింది. రాధ పలికింది. కొంతసేపటికి గేటు తీసింది. రాధ ఆశ్చర్యంగా 'అర్ధరాత్రి వచ్చావేం!' అన్నది. కమల చిట్టిబాబు పరిస్థితి వివరించింది. రాధ వెంటనే మేడమీద ఉన్న భర్తను పిలిచింది. ఆయన మేడచివరకు వచ్చాడు. రాధ చెప్పింది. 'వస్తున్నాను—పదమను' అన్నాడు. రాధకి సందేహం వచ్చింది. 'మీవారు ఇంట్లో లేరా! రాత్రివేళ నువ్వు వచ్చావు' అన్నది రాధ. కమలకు చీకట్లో కళ్ళనీళ్లు తిరిగాయి. రామారావు ఇంటిదగ్గర లేడు అని చెప్పటం ఇష్టంలేదు. ఊరుకుంది. రాధకు తెలుసు. ఆ విషయం ఇప్పుడు అన్వయించుకోలేకపోయింది. అంతే.

కమల సందు తిరిగింది. అంతా చీకటి. అయినా బేటరీ లైటు వేయలేదు. వెనకాల ఎవరో వస్తున్నారు. తిరిగి చూసింది. గూడకట్టు. ఆమనిషి వెంబడిస్తున్నాడని తెలుసుకుంది కమల. నడక వడి ఎక్కువ చేసింది. వాడు 'ఏయ్-ఆగు' అన్నాడు. కమల గుండెలు జారిపోయాయి. వాడు వేగంగా వెంబడిస్తున్నాడు. 'ఏయ్-నిన్నే' అన్నాడు. కమల నడక మరీ సాగుతోంది. శృంగాటకం మీదుగా కమల వాళ్ళ వీధికి మళ్లింది. వాడు పరుగెత్తుకు వస్తున్నాడు. దగ్గరకు వచ్చాడు. కమల 'బాబోయ్' అన్నది. 'ఎవడురా, వాడు' అని వెనకాల కేక వినిపించింది. గూడకట్టు వాడు పరిగెడుతున్నాడు. కేక వేసిన వ్యక్తి వెంబడించాడు. ప్రాణం కుదుటపడింది, కమలకు. ఇంటివైపుగా సాగుతోంది. 'ఏం దేశమో-ఆడది గత్యంతరంలేక ఒక్కతే బయలుదేరితే వెంబడిస్తారు. ఇంత కావరమా!' ఇంతలో గూడకట్టు వాడిని వెంబడించిన వ్యక్తి తిరిగి ఎదురు వచ్చాడు. రామారావు! అతని కంఠం కరుకుగా మారింది. అందుచేత అప్పుడు గుర్తుపట్టలేదు. తన ఎదర పరిగెడుతున్నా గమనించలేదు. 'ఆగు - ఎక్కడికి వెళ్లావు? ఎందుకు వెళ్లావు?' అన్నాడు తొందరగా రామారావు. అతని కంఠంలోంచి వెలువడ్డ మాటలు ఆమె గుండెల్లో బాకులవలె గుచ్చుకున్నాయి. 'చెప్పవేం!' అన్నాడు మళ్ళా అతను. ఆమెకు కొంచెం కోపం వచ్చింది. కొంచెం దుఃఖం కలిగింది. అతని మాటలలో అనుమానం ద్యోతమానం అయింది. 'దిక్కులేని ఆడది ఎక్కడికైనా, ఎందుకైనా వెడుతుంది' అని నిశ్చయంగా పలికింది. రామారావుకి పట్టరాని కోపం వచ్చింది. ఒక లెంపపెట్టు పెట్టాడు. ఆమెచేయి పట్టుకొని ఇంటికి బరబరా ఈడ్చుకు వెళ్లాడు. మధ్య గదిలో ప్రవేశించాడు. సుందరం 'నాన్నా' అని ఏడ్చింది. చిట్టిబాబు ఉలికిపడి బిగ్గరగా ఏడ్చాడు. బలవంతాన కమలను కొప్పు

పట్టుకొని నిలువపెట్టాడు. 'ఈమాటు చెప్పు' అన్నాడు. సుందరం అడ్డు వచ్చింది. కమల మౌనంగా అలాగే కన్నీళ్లు కారుస్తూ నిలుచుని ఉంది. సుందరం తండ్రి మొగం చూసింది. 'చిట్టి బాబుకి జబ్బుగా ఉన్నది. అమ్మని కొట్టకు నాన్నా' అంది సుందరం దీనంగా. రామారావు అర్థం చేసుకున్నాడు. కమల కొప్పు విడిచాడు- వెంటనే పిల్లవాడి ఒళ్ళు చూశాడు. నిర్ఘాంతపోయాడు. కమలముఖం చూశాడు. గంభీరంగా ఉన్నది. కన్నులలోంచి చిన్నముత్యాల జల్లువలె బాష్పాలు జారుతున్నాయి. అతను క్షమించమన్నట్లు చూశాడు. తాను సిగ్గుపడినట్లు చూశాడు. అప్రయత్నంగా 'నా తప్పు' అన్నాడు.

ఇంతలో శేషారావు వచ్చాడు. చిట్టిబాబుని చూశాడు. ఏవో మందులు ఇచ్చాడు. 'ఫరవా లేదమ్మా' అని వెళ్లిపోయాడు. తెల్లవారింది. వాన కురిసి వెలిసింది.

# ఉద్యోగాలు - వేతనాలు

వెన్నవెల్లి సుబ్బారావు

ప్రభువు, ప్రభుత్వం, పరిపాలన యేనాటినుంచి యేర్పడ్డాయో, అప్పటి నుంచీ ప్రజలు ప్రభుత్వోద్యోగాల కోసం ప్రయత్నించడం ప్రారంభమై ఉండవచ్చు. ప్రభుత్వ కార్యకలాప నిర్వహణకు కావలసిన సిబ్బందిని వారి అర్హతలను బట్టి, ఉద్యోగ హోదాను బట్టి, వ్యత్యాసపు వేతనాలతో నియమించడం అనాది నుంచీ వస్తూ వుండవచ్చు. ఉద్యోగికి వుండే ఒక విధమైన గౌరవం, అధికారం రెండు చేతులా ధన సంపాదనకు అవకాశం చూచి క్రమంగా ప్రజలంతా ఉద్యోగవ్యామోహంలో పడి, స్వవృత్తులకు స్వస్తి చెప్పి ఉద్యోగాల కోసం ప్రాకులాడడం ప్రారంభించారు. కాని ఉద్యోగాలు పరిమితం, వాటికోసం ప్రయత్నించే వారిసంఖ్య అపరిమితం'అయిపోగా- కొంతకాలం ప్రతి ఆఫీసు యెదుట 'ఖాళీలేదు' అనే బోర్డు తగిలించి, ప్రయివేటుగా సిఫార్సులో బహుమతులో తెచ్చిన వాళ్లకుమాత్రం ఉద్యోగాలు యిస్తూవచ్చారు. కొంతకాలానికి ఈపరిస్థితి మారి, ఉద్యోగార్హతను నిర్ణయించడానికి 'సర్వీస్ కమీషన్' పరీక్ష అంటూ ఒకటిపెట్టి, దానిలో ప్యాసయినా కాకపోయినా, కులాల వారీగా ఉద్యోగాలకు తీసుకోవడం మొదలు పెట్టారు. అష్టకష్టాలు పడి అన్ని పరీక్షలు ప్యాసైనా, ఉద్యోగం దొరకక కొంతకాలం నిరుద్యోగ సమస్య యేర్పడి చాల మంది యువకులు నిరుత్సాహులై మూలబడి వాపోవలసిన పరిస్థితి యేర్పడింది. కాని వారి అదృష్టరేఖా అన్నట్టు ద్వితీయ ప్రపంచ యుద్ధం రాగానే, చాలమందికి ఉద్యోగాలు అయాచితంగా లభించాయి. ఆ మహాయుద్ధం తుదముట్టగానే మళ్ళీ ఉద్యోగాల తగ్గింపు ప్రారంభమై వేలాది యువకులు ఇళ్ళకు మళ్లింపబడడం, దానితో తిరిగి 'నిరుద్యోగ సమస్య' ఏర్పడడం జరిగింది. తన్నివారణకు ''ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజి'' అనే సంస్థ వెలిసి, నానా అవస్థలతో ఏ కొంత మందికో తిరిగి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇదీ యిప్పటి పరిస్థితి. ముందుముందు ఈ ఉద్యోగాల గ్రహస్థితి యెట్లా వుంటుందో చెప్పగలిగే జోస్యులెవరూ కానరావటం లేదు.

ఇప్పట్లో సర్కారు ఉద్యోగం కావాలంటే దానికోసం ఆఖరు మెట్టుగా 'స్కూలు ఫైనలు' పరీక్ష, తరువాత యఫ్.ఏ., బి.ఏ., యం.ఏలు., వానికి సంబంధించిన టెక్నికల్ పరీక్షలు యెన్నెన్నో అంతులేకుండా ఉన్నాయి. ఎన్ని పరీక్షలు ప్యాసయినా ప్రస్తుతం కులమే అర్హతగా చిన్న ఉద్యోగాలు, లోపాయికారీ సిఫా